"దేవా! లోకంలో ఎందరికో అనేక సుఖాలిచ్చే నువ్వు నాకెందుకు ఇన్ని కష్టాలిచ్చావు? నువ్వంటూ నిజంగా వుంటే, రేపు ఈపాటికల్లా నన్ను ఈ కష్టాల్లోంచి బయట పడెయ్. లేదా నువ్వు లేవని నిర్ధారించుకుంటాను."

ఆ రాత్రి అతను నిద్రకి ఉపక్రమించాక, పూర్తి నిద్ర, పూర్తి మెలకువ కాని మగత స్థితిలో వున్నాడు. అప్పుడతనికి కాంతి శరీరంతో ఒకరు దర్శనమిచ్చారు. ఆయనే దేవుడని గ్రహించిన అతను ఆయనతో చెప్పాడు.

"దేవా! నన్ను ఈ కష్టాల ఊబిలోంచి బయటకి లాగు."

దేవుడు అతని తలని మృదువుగా నిమిరాడు. అతని కష్టాల మూట దేవుడి చేతిలోకి వచ్చింది. దాన్ని దేవుడు అతని చేతికిచ్చి చెప్పాడు.

"పక్క గదిలో చాలా మూటలున్నాయి. దీన్ని అక్కడ వుంచి ఇంకో కష్టాల మూట ఏదైనా తెచ్చుకో."

వెంటనే ఆ మనిషి ఉత్సాహంగా పక్క గదిలోకి వెళ్ళి తన మూటని గిరాటేసి అక్కడ ఉన్న మూటలన్నింటినీ పరిశీలించాడు. వ్యభిచారం, దొంగతనం లాంటివి చేసిన వారి కష్టాల మూటలవి. అవి నచ్చక చివరికి ఓ మూటని ఎంచుకుని, దాంతో బయటకి వచ్చాడు.

"థాంక్‌యూ దేవా." చెప్పాడతను.

"వత్సా! నువ్వు ఆ గదిలోకి తీసుకెళ్ళిన మూటనే మళ్ళీ తెచ్చావు." దేవుడు చిరునవ్వు నవ్వి చెప్పాడు.

**నీతి:-** దేవుడు మనకిచెందని కష్టాలని మనకెన్నడూ ఇవ్వడు. మనమెంత వరకు అర్హులమో ఆ మేరకే కష్టాలనిస్తాడు.

## 23. నాలుగు స్థితులు

బ్రహ్మవిద్య నేర్చుకోవడానికి ఒకతను ఓ సాధువు దగ్గర చేరాడు.

"స్వామీ! నాకీ జన్మలో నేనే బ్రహ్మన్ని అని తెలుసుకునే అవకాశం వస్తుందా?" అడిగాడు ఓ ఏడాది ఆయనతో వున్న తర్వాత.

"నువ్వింకా ఏనుగు స్థితిలోనే ఉన్నావు. చూద్దాం." చెప్పాడాయన.

మరో ఏడాది గడిచాక మళ్ళీ అడిగాడు శిష్యుడు.

"స్వామీ! నాకీ జన్మలో నేనే బ్రహ్మన్ని అని తెలుసుకునే అవకాశం వుందా?"

"చూద్దాం. నువ్వింకా చీమ స్థితిలోనే వున్నావు."

మరో ఏడాది గడిచింది. మళ్ళీ శిష్యుడు గురువుని ప్రశ్నించాడు.

" నాకీ జన్మలో నేనే బ్రహ్మన్ని అని తెలుసుకునే అవకాశం వుందా?"

"నువ్వింకా తేనెటీగ స్థితిలోనే వున్నావు. చూద్దాం."

మరో ఏడాది గడిచింది. ఐతే ఈసారి శిష్యుడు గురువుని ఎలాంటి ప్రశ్న వేయలేదు. కొద్ది కాలమయ్యాక గురువు శిష్యుడ్ని పిలిచి అతని వంక అప్యాయంగా చూస్తూ చెప్పాడు.

"నువ్వు సాలె పురుగు స్థితికి వస్తున్నావు. నువ్వు నీ ప్రయత్నం వదలకపోతే ఈ జన్మలోనే పరబ్రహ్మానుభూతి లభిస్తుంది."

"స్వామీ! ఏనుగు స్థితి, చీమ స్థితి, తేనెటీగ స్థితి అని ఇదివరకు అన్నారు. ఇప్పుడు సాలె పురుగు స్థితి అంటున్నారు. ఆ స్థితులేమిటో నాకు తెలీదు. దయచేసి చెప్తారా?" ప్రార్థించాడు శిష్యుడు.

"సాధకుల్లో నాలుగు రకాలున్నారు. మొదటివారు ఏనుగులాంటి వారు. ఏనుగు ఎంత బలమైన జంతువైనా, ఇసుక రేణువుల్లోంచి చక్కెరని ఏరలేదు. అలాగే లౌకిక సుఖాన్ని, అలౌకిక సుఖాన్ని మొదటి రకం జిజ్ఞాసి వేరు చేసి చూడలేడు. ధ్యానంలో ప్రగతి సాధించాక అతను చీమ స్థితికి చేరుకుంటాడు. చీమ ఇసుక నించి చక్కెరని వేరు చేయగలిగినట్లుగా తన తాత్కాలికమైన భౌతిక సుఖాలని వదిలి భజన, సత్సంగంలాంటి వాటిలోని రుచిని అనుభవించగలుగుతాడు. ఆ తర్వాతి స్థితి తేనెటీగ స్థితి. అది వివిధ పుష్పాలనించి మకరందాన్ని ఎలా సేకరిస్తుందో, అలా సాధకుడు కనబడేదంతా

అశాశ్వతమని గ్రహించి, బ్రహ్మ పదార్థం ఒక్కటే శాశ్వతమని అర్థం చేసుకోగలుగుతాడు. చివరిది సాలెపురుగు స్థితి. సాలీడు తననించి దారాన్ని తయారుచేసి తిరిగి దాన్ని ఎలా మింగుతుందో, అలా తన మనసుతో తాను చేసుకున్న ఈ ప్రపంచాన్ని తిరిగి మింగి ఆ సాధకుడు చివరికి తనే బ్రహ్మం కాగలుగుతాడు." వాటిలోని అంతరార్థాన్ని వివరించారు గురువుగారు.

త్వరలోనే ఆ శిష్యుడికి ఆత్మజ్ఞానం లభించి ముక్తుడయ్యాడు.

## 24. అంచెలంచెలు

మోక్షం మీద మమకారం గల ఒకతను మంచి గురువు కోసం వెదుక్కుంటూ అనేక ప్రదేశాలు తిరిగాడు. చివరికి అతనికి శ్రీశైలంలోని ఘంటా మఠంలోని స్వరూపానంద స్వామితో పరిచయమైంది. నిష్ఠగా జీవితాన్ని గడిపే ఆయన మీద గౌరవం కలగడంతో తనని శిష్యునిగా స్వీకరించమని వేడుకున్నాడు. అందుకాయన అంగీకరించి చెప్పాడు.

"నాకు తెలిసిందంతా నీకు బోధిస్తాను."

గురువుతో అదే మఠంలో నివశిస్తూ శిష్యుడు హఠ, ధ్యాన యోగాలని అనుష్ఠించ సాగాడు. అలా కొన్నాళ్ళు గడిచాక శిష్యుడికి తను సరైన మార్గంలోనే వున్నాడా అన్న అనుమానం మొదలై క్రమేపీ అది తీవ్రమైంది.

ఓ రోజు గురువు శిష్యుడి వంక వాత్సల్యంగా చూస్తూ అడిగాడు.

"ఇటీవల చాలా కలవర పడుతున్నావు. నీ సందేహం ఏమిటి?"

"స్వామీ! ఆధ్యాత్మిక సాధన చేసే కొద్దీ మనసు స్వచ్ఛమవుతుందని శాస్త్రాలు చెప్తున్నాయి. నేనిక్కడికొచ్చి రెండేళ్ళు గడిచాయి. ఎంత తీవ్రంగా సాధన చేసినా నా మనస్సు స్వచ్ఛంగా మారడం లేదు. స్త్రీని చూస్తే ఇదివరకటిలాగే మనసు ఆలోచిస్తోంది. ఇలాగే ప్రతీ భోగ విషయంలో జరుగుతోంది. ఎందుకిలా?" అడిగాడు శిష్యుడు.

గురువు చిన్నగా నవ్వి చెప్పాడు.